జాతీయస్థాయి శిబిరానికి రాంబాబు

భీమవరం: ఈ నెల 25 నుండి వచ్చే నెల ఐదో తేదీ వరకు పంజాబ్‌లోని రూప్‌నగర్‌లో జరిగబోయే ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ శిబిరానికి డిఎన్ఆర్ కళాశాల సీనియర్ డివిజన్ ద్వితీయ సంవత్సర క్యాడెట్ పి.రాంబాబు ఎంపికైనట్లు ఆ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సిహెచ్.జె.సోమరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్‌ను కళాశాల ఆవరణలో ఆదివారం అభినందించారు. ముఖ్యఅతిథి కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు జి.పాండురంగారాజు, పరిపాలనాధికారి పి.రామకృష్ణంరాజు మాట్లాడుతూ అత్యుత్తమ ప్రదర్శనతో ఒక జాతీయ క్యాంపులో కళాశాల క్యాడెట్ ఎంపిక కావడం గొప్ప విషయమని, కళాశాలకు గర్వకారణమని అన్నారు. ఎంపికైన క్యాడెట్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎ.వీరయ్య, సీనియర్ క్యాడెట్లు సిహెచ్.హేమసుందర్, ఎన్.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తల్లడిల్లిన తణుకు

వేర్వేరు విహార యాత్రల్లో ఆరుగురు దుర్మరణం, మరొకరు గల్లంతు

మొన్న కాకినాడ జిల్లా.. నిన్న పేరుపాలెం బీచ్‌ల్లో ఘటనలు

శోకసంద్రమైన తణుకు పరిసర ప్రాంతాలు

వేర్వేరు విహార యాత్రల్లో తణుకు పట్టణానికి చెందిన ఆరుగురు మృత్యువాత పడటం, మరొకరు గల్లంతు కావడం తీవ్ర విషాదం నింపింది. శనివారం కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంకలో గోదావరిలో స్నానానికి దిగిన సజ్జాపురానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాల కోసం పట్టణవాసులు ఎదురుచూస్తుండగానే ఆదివారం పేరుపాలెం బీచ్‌లో తణుకులోని బొమ్మలవీధికి చెందిన ఇద్దరు మృత్యువాత పడగా మరొకరు గల్లంతయ్యారు. వరుస ఘటనలతో తణుకు పట్టణ ప్రజలు తల్లడిల్లారు.

బీచ్‌లో సావిత్రి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సావిత్రి (ఫైల్‌ఫోటో)

రఘువర్మ (ఫైల్‌ఫోటో)

మొగల్తూరు : విహార యాత్ర మరోసారి తణుకు పట్టణవాసులను బలిగొంది. మండలంలోని పేరుపాలెం బీచ్‌కు తణుకు పట్టణంలోని బొమ్మలవీధికి చెందిన సుమారు 15 మంది రెండు ఆటోల్లో ఆదివారం ఉదయమే చేరుకున్నారు. మధ్యాహ్న సమయంలో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతికి వీరిలో కొందరు నీట మునిగారు. దీన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై వారిని ఒడ్డుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. గొరస సావిత్రి (35), అనపోజు శ్రావణి, గొరస తన్మయి, అనపోజు రఘువర్మ (25)లను ఒడ్డుకు చేర్చగా అప్పటికే సావిత్రి ప్రాణాలు కోల్పోయింది. మిగిలిన ముగ్గురిని హుటాహుటిన అంబులెన్స్‌లో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే రఘువర్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రావణి, తన్మయిల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వీరితోపాటు నీట మునిగిన అనపోజు వసంతకుమార్ (17) గల్లంతయ్యాడు. వసంతకుమార్ ఆచూకీ కోసం పోలీసులు బీచ్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని సిఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్ఐ ఎం.వీరబాబు సందర్శించారు. సావిత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తణుకు: సజ్జాపురానికి చెందిన యువకుల విహారయాత్ర విషాదమయమైన ఘటన జరిగిన 24 గంటల్లోపే మరో ఘటన పేరుపాలెం బీచ్‌లో చోటుచేసుకుంది. బీచ్‌లో మృతి చెందిన గొరస సావిత్రి పట్టణంలోని వెల్లంకివారి గుడి సమీపంలో నివాసం ఉంటుంది. ఆమె ఇంటి వద్దే ఉంటోంది. అనపోజు రఘువర్మ విజయవాడలోని ఇంజినీరింగ్ పూర్తి చేయగా, వసంతకుమార్ డిగ్రీ చదివాడు. వీరంతా పట్టణంలోని బొమ్మలవీధికి చెందినవారు. రఘువర్మ, వసంతకుమార్ వీరభద్రపురంలోని రాజేశ్వరిపురంతకు చెందినవారు. దీంతో ఆయా ప్రాంతాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

గోదావరిలో గల్లంతైన తణుకు యువకుల మృతదేహాలు లభ్యం

తణుకు : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోపులంక వద్ద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన నలుగురు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. తణుకులోని సజ్జాపురం ప్రాంతానికి చెందిన యువకులు విహారయాత్రకు యానాం వెళ్లిన సంగతి తెలిసిందే. వీరు యానాం నుంచి తిరుగుప్రయాణంలో శనివారం సాయంత్రం తాళ్లరేవు మండలం గోపులంక వద్దకు వచ్చేసరికి గోదావరిలో స్నానానికి దిగి నలుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. తొలుత పెండ్యాల బాలాజీ, మద్దిని ఫణీంద్రగణేశ్, హనుమకొండ కార్తీక్ మృతదేహాలు లభ్యమయ్యాయి. తర్వాత కొద్దిసేపటికి రవితేజ మృతదేహం లభ్యమైంది. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మధ్యతరగతి కుటుంబాల్లో పెను విషాదం

గోపులంకలో గోదావరిలో నీట మునిగి మృతి చెందిన యువకులంతా మధ్యతరగతి కుటుంబీకులే. కష్టపడి వారిని చదువులు చదివించిన విహారయాత్ర రూపంలో మృత్యువు కాటేయడాన్ని ఆ కుటుంబీకులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుల్లో ఒకరైన తిరుమల రవితేజ తండ్రి 2016లో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో తల్లి టీ కొట్టు నడుపుకుంటూ కొడుకును ఉన్నత చదువు చదివిస్తోంది. పెండ్యాల బాలాజీ తల్లి ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తోంది. మద్దిన ఫణీంద్ర గణేష్ తండ్రి ఉపాధి కోసం దుబాయి వెళ్లారు. హనుమకొండ కార్తీక్ సోనోవిజన్ కంపెనీలో పని చేస్తున్నాడు.

పాలస్తీనాపై దాడిని నిరసిస్తూ ర్యాలీ

ఇజ్రాయిల్ జాత్యాహంకార దాడిని ఖండించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఆకివీడు

సభలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

పశ్చిమాసియాలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ జాత్యాహంకార దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక రైస్‌మిల్లర్స్ హాలు వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో సీతారాం మాట్లాడుతూ ఇజ్రాయిల్‌కు అమెరికా, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద దేశాల మద్దతు వారి అహంకారానికి నిదర్శనమన్నారు. వారం రోజులుగా ఇజ్రాయిల్‌పై సాగిస్తున్న దాడిలో అనేక మంది బాలలు, వృద్ధులు మృత్యువాత పడ్డారని, అక్కడ పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని అన్నారు. ఇజ్రాయిల్ దాడితో పాలస్తీనాలో 10 శాతం కూడా మిగిల్లేదన్నారు. మొత్తం ఇజ్రాయిల్ ఆక్రమణ ప్రభుత్వమేనన్నారు. ప్రస్తుత పాలస్తీనా పరిస్థితిపై 50, 60 దేశాల్లో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్న మన ప్రధాని, మీడియాకు పట్టకపోవడం దురదృష్టకరమన్నారు. జాత్యాహంకారులకు మద్దతిచ్చే ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ పాలస్తీనాకు సిపిఎం సంఘీభావం ప్రకటిస్తోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు.

ప్రజాసమస్యలు పట్టని అధికార, ప్రతిపక్ష పార్టీలు

ప్రత్యామ్నాయ విధానాల ప్రచారానికే బస్సు యాత్రలు

సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో ఆదివారం స్థానిక రైస్‌మిల్లర్స్ హాలులో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలపై రూపొందించిన ప్రణాళికలను ప్రజలకు వివరించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు యాత్రలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 30వ తేదీ నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు యాత్రలు సాగుతాయన్నారు. విశాఖపట్నం నుంచి వచ్చే బస్సు యాత్ర నరసాపురం, భీమవరం మీదుగా విజయవాడ చేరుకుంటుందన్నారు. ఈ యాత్రను కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణానికి ప్రత్యేక నిధులు, రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు, రైల్వే జోన్‌పై ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రజావ్యతిరేక కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి యాత్ర సందర్భంగా నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సాగునీటి ఎద్దడిపై నివేదిక ఇవ్వండి

అత్యవసర పనులు ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో పెట్టండి

నేడు 50 మంది కూలీలతో కాల్వ పనులు

జిల్లా అధికారుల ఆదేశం

ప్రజాశక్తి వార్తకు స్పందన

పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

'పాలకోడేరు కెనాల్‌కు చేర్చి ఎంత ఆయకట్టు ఉంది.. ఎన్ని ఎకరాలకు సాగునీటి ఎద్దడి ఉంది.. నీరందకపోవడానికి కారణం ఏమిటీ.. వెంటనే నివేదిక పంపండి' అంటూ జిల్లా అధికారులు మండల అధికారులను ఆదేశించారు. తక్షణం కెనాల్‌ను బాగు చేయాలని, దీనికి అత్యవసరంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పెట్టి పనులు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ గ్రామాలతో పాటు పాలకోడేరులో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని 'కంటిమీద కునుకు కరువు' శీర్షికన ఈ నెల 22న ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు, ఇరిగేషన్ ఎఇ వినయ్, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పాలకోడేరు వ్యవసాయాధికారి వి.నారాయణరావు పాలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోని వరి పొలాలను ఆదివారం పరిశీలించారు. పాలకోడేరు కెనాల్‌కు చేర్చి ఉన్న ఆయకట్టును పరిశీలించి వివరాలు సేకరించారు. పొలిమేర బోదె, పొడుపు ఏరియా వరి పొలాలు పరిశీలించి నీటి ఎద్దడిపై ఆరా తీశారు. ఇప్పటికే ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పొలాలు కీలక దశలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో సాగునీరు ఎంతో అవసరమని చెప్పారు. నీరందక పొలాలు నెర్రలు తీస్తున్నాయని వాపోయారు. దీంతో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరికి చెప్పినా సమస్య పట్టించుకోవట్లేదని వాపోయారు. తమ వరి పొలాలకు నీటిని అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు అధైర్య పడొద్దని, పూర్తిస్థాయిలో నీరందించేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడామన్నారు. ఆయకట్టులోని భూమికి ఎక్కడెక్కడ నీటి ఇబ్బందులున్నాయో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ పాలకోడేరు కెనాల్‌లో పేరుకుపోయిన తూడు, చెత్త తొలగింపు పనులు తక్షణం చేపట్టాలని ఆదేశించారు. మండల పరిషత్ నిధులతో పనులు చేసే అవకాశం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. లేనిపక్షంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల కింద చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తక్షణం సోమవారం 50 మంది కూలీలను పెట్టి కాల్వ పనులు చేయించాలని ఆదేశించారు. వీరి వెంట ఆర్ఐ నాగభూషణంనాయుడు, ఆయకట్టు రైతులు ఉన్నారు.

సాగునీరందించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని పెనుమదంలో వరి పొలాలకు సాగునీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేత బొంతు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో పెనుమదం అలిపరుమడుగు కాల్వకు సంబంధించిన వరి చేలో దిగి సాగునీరందించాలని ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ కాలవకు సంబంధించి 150 ఎకరాల్లో వరి పొలాలు పొట్టదశలో ఉన్నాయన్నారు. ఈ సమయంలో సాగునీరు అందకపోవడం వల్ల కంకులు బయటకు రాకపోవడం వల్ల చేలు నెర్రలు కొట్టాయని, సాగునీరు వెంటనే అందించాలని కోరారు. ఈ సమయంలో నీరందకపోతే దిగుబడి తగ్గే అవకాశం ఉందని, రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరందక వచ్చే నష్టానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కట్టా అబ్బులు, దొంగ వెంకట్రావు, మొల్లేటి ఆంజనేయులు, గుబ్బల వెంకట్రావు పాల్గొన్నారు.

సాగునీరిస్తాం

జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

అత్తిలి: అదనంగా రెండు రోజులు వంతు ఇచ్చి సాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఈడూరు గ్రామంలో నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత 10 రోజుల నుంచి నీటిఎద్దడి తీవ్రంగా ఉందని, ప్రస్తుతానికి నీరు తక్కువగా వస్తోందని వాపోయారు. దీనిపై వెంకటేశ్వరరావు స్పందిస్తూ నీటిపారుదలశాఖ ఇతో మాట్లాడి ఇంకో రెండు రోజులు వంతు ఇప్పించి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ టికె.రాజేష్, విఎఎ.రాము, విఆర్ఒ.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పోడూరు: సాగునీరందించాలని నిరసన తెలుపుతున్న నేతలు, రైతులు

అన్నిరంగాల్లో రాణించేలా

యువతకు ప్రోత్సాహం

యువజన సర్వీసుల శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ మెహర్రాజ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడలతో పాటు యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేలా అనేక అవగాహన కార్యక్రమాలు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నామని యువజన సర్వీసుల శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిఇఒ ఎమ్‌డి హెచ్.మెహర్రాజ్ తెలిపారు. యువతకు కెరీర్ అవకాశాలు కల్పించడానికి ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.. క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల్లో ప్రమాణాలు పెంపొందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు జిల్లా నుంచి ఎంతమంది పాల్గొంటున్నారు? తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభం కానుంది?

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వచ్చే డిసెంబర్ 11వ తేదీ నుంచి గ్రామ వార్డు పరిధిలోను, డిసెంబర్ 21వ తేదీన మండల నియోజకవర్గ స్థాయిలోనూ, 31వ తేదీన జిల్లాస్థాయిలోనూ పోటీలు జరుగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లాస్థాయి పోటీల్లో విజేతలను ఎంపిక చేస్తాము.

ప్రశ్న : ఏయే క్రీడల్లో ఈ పోటీలుంటాయి? అందుకు అవసరమైన క్రీడా సామగ్రి ఏమైనా ప్రభుత్వం నుంచి వచ్చిందా?

క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖో ఖో, కబడ్డీ వంటి పోటీలుంటాయి. ఇప్పటికే క్రికెట్ వాలీబాల్ కిట్లు జిల్లాకు చేరుకున్నాయి.

ప్రశ్న : పులివెందులలో ఉన్న స్పోర్ట్స్ అకాడమీకి సెలక్షన్స్ జరిగాయా? జిల్లా నుంచి ఎంతమంది ఎంపికయ్యారు?

స్పోర్ట్స్ అకాడమీకి ఈనెల నాలుగు, ఐదు తేదీల్లో జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయి. 17 మందితో జాబితాను పంపాము. అక్కడ మళ్లీ ఫైనల్ సెలక్షన్ ఉంటుంది.

ప్రశ్న : ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు పనులు ఎంతవరకు వచ్చాయి?

ఖేల్ ఇండియాలో భాగంగా సింథటిక్ ట్రాక్ పనులు ఇంకా మొదలు పెట్టలేదు. ట్రాక్ ఏర్పాటుకు రూ.తొమ్మిది కోట్లతో ప్రతిపాదనలు పంపాము. అందులో నాలుగు కోట్ల రూపాయలు ఏలూరు పార్లమెంటు సభ్యులు కోటగిరి శ్రీధర్ ఇస్తున్నారు. మిగిలిన సొమ్ము స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి మంజూరు కావాల్సి ఉంది.

ప్రశ్న : ప్రస్తుతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో రెగ్యులర్ కోచ్‌లు ఎంతమంది ఉన్నారు? కోచ్‌ల నియామకం చేపట్టే అవకాశం ఏమైనా ఉందా?

ప్రస్తుతం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు ఫుట్ బాల్, వెయిట్ లిఫ్టింగ్‌కు మాత్రమే రెగ్యులర్ కోచ్‌లున్నారు. మిగిలిన క్రీడాంశాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కోచ్‌లు పనిచేస్తున్నారు. కోచ్‌ల నియామకం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం.

ప్రశ్న : జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని ఎర్రకాలువ రిజర్వాయర్లో నిర్వహిస్తున్న వాటర్ గేమ్స్ కోచింగ్ ఎలా జరుగుతుంది? కోచ్‌లున్నారా? ఎంతమంది కోచింగ్ తీసుకుంటున్నారు?

ప్రస్తుతం 20 మంది వాటర్ గేమ్స్‌లో కోచింగ్ తీసుకుంటున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన ఇద్దరు అక్కడ కోచింగ్ ఇస్తున్నారు.

ప్రశ్న: ఏలూరులోని ఇండోర్ స్టేడియం నిర్వహణ అధ్వానంగా ఉండటం వల్లనే, ఇలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో కూలిపోయిందనే అపోహలు ప్రజల్లో ఉన్న నేపథ్యంలో ఇండోర్ స్టేడియం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గతంలో ఇండోర్ స్టేడియం మరమ్మతులకు రూ.22 లక్షలు మంజూరైనప్పటికీ సకాలంలో పనులు జరగలేదు. అది కూలిపోయిన నేపథ్యంలో రూ.రెండు కోట్లతో కొత్త ఇండోర్ స్టేడియం నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాము. ఎస్టిమేషన్ ఇవ్వాలని హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఇండోర్ స్టేడియం మైదానంలో స్కేటింగ్ రింక్, వెయిట్ లిఫ్టింగ్ హాల్, హ్యాండ్ బాల్ కోర్ట్ కూడా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపాము.

ప్రశ్న : యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి యువజన సర్వీసుల శాఖ ద్వారా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో అవగాహన కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వ హించడం జరుగుతుంది. దీని ద్వారా పదో తరగతి తర్వాత యువతకు ఉండే ఉపాధి అవకాశాలపై అవగా హన కల్పించడం జరుగుతుంది. అంతేకాక ఎంప్లాయి మెంట్ ఎక్స్ఛేంజ్, ప్రభుత్వ ఐటిఐతో కలిపి జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాము. ఇటీవల జరిగిన జాబ్ మేళాలో జిల్లాలో 39 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాము.

ప్రశ్న : యువతలో సామాజిక బాధ్యత పెంపొందించేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

వివిధ కోచింగ్ సెంటర్ల ద్వారా వివిధ కాంపిటేటివ్ పరీక్షలకు యువతకు కోచింగ్ ఇస్తున్నాము. అలాగే రక్తదాన శిబిరాల నిర్వహణ, మొక్కలు నాటడం వంటివి నిర్వహించి యువతలో సామాజిక బాధ్యతను పెంచే చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

కొత్త జిల్లా కేంద్రాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ - యుటిఎఫ్ పోరాట ఫలితం - అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ నిరంతరం అలుపెరగకుండా ఎంతో శ్రమిస్తోంది. సామాజిక, సేవా కార్యక్రమాల్లో తనకంటూ యుటిఎఫ్ ఒక ప్రత్యేక ముద్ర వేసుకుంది. కరోనా కష్టకాలంలో యుటిఎఫ్ కార్యాలయాలన్నీ ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చి కరోనా సోకిన వారికి వైద్య సేవలందించి వారి ప్రాణాలను నిలబెట్టింది. ఆ సమయంలో లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు కూడా అందించి మానవత వృక్పథాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా నిలబడి ప్రభుత్వం వివిధ రూపాల్లో భయపెట్టిన, భయభ్రాంతులకు గురిచేసిన, నిర్బంధించిన, అరెస్టు చేసిన, అక్రమ కేసులు బనాయించినప్పటికీ సమస్యలు పరిష్కారమే అజెండాగా ముందుకు సాగుతోంది. యుటిఎఫ్ సాగించిన అనేక పోరాటాల్లో ఎన్నో ఫలితాలు సాధించి ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తుకు యుటిఎఫ్ భరోసా కల్పించింది. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలకు హెచ్‌ఆర్ఎ పెంపు విషయంలో ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌ఆర్ఎ పెంపును కుదించింది. వాస్తవానికి జిల్లా కేంద్రం ఎండ్ నుండి ఎనిమిది కిలోమీటర్లు పరిధిలో ఉన్న గ్రామాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ ఇవ్వాల్సి ఉంది. అయితే మున్సిపల్ కేంద్రం ఎండ్ బేస్ చేసుకుని హెచ్‌ఆర్ఎ కుదించారు. ఈ నేపథ్యంలో 22 గ్రామాల పరిధిలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు 16 శాతం హెచ్‌ఆర్ఎ కోల్పోయారు. పైగా 12 నుంచి రెండు శాతం హెచ్‌ఆర్ఎ కోల్పోయి 10 శాతానికి వచ్చేయడంతో తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ రంగంలోకి దిగి సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపట్టింది. డిఇఒ, ఆర్‌డిఒ, డిటిఒ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టింది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ సైతం జోక్యం చేసుకుని సమస్యను జిల్లా కలెక్టర్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించారు. అక్కడితో వదిలేయకుండా 16 శాతం హెచ్‌ఆర్ఎ రివైజ్ గెజిట్ ఇచ్చే వరకు నిరంతరం కలెక్టర్‌తో సంప్రదింపులు సాగించారు. ఫలితంగా యుటిఎఫ్ కృషితో కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రం భీమవరం సెంటర్ పాయింట్ నుండి ఎనిమిది కిలోమీటర్ల వరకూ 16 శాతం హెచ్‌ఆర్ఎ వర్తింపజేస్తూ ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఫలితంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభ్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు కెసిహెచ్.సాయిరాం, కెఎస్.రామకృష్ణప్రసాద్, జి.రామకృష్ణంరాజు, సిహెచ్.కుమార్‌బాబ్జీ, డి.ఏసుబాబు, భీమవరం టౌన్, రూరల్, పాలకోడేరు నాయకులను పలువురు అభినందించారు.

కోరుకొల్లుకు వర్తింపజేయాలి

పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

పాలకోడేరు మండలం కోరుకొల్లు నుంచి అత్తిలి మండలం ఉనికిలి, స్కిన్నెరపురానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. జిల్లా కేంద్రం భీమవరానికి కోరుకొల్లు దగ్గరగా, ఉనికిలి, స్కిన్నెరపురం దూరంగా ఉన్నాయి. కానీ 16 శాతం హెచ్‌ఆర్ఎను ఉనికిలి, స్కిన్నెరపురానికి వర్తింపజేశారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న కోరుకొల్లుకు మాత్రం వర్తింపజేయలేదు. ఇలా కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు ఉన్నాయి. కోరుకొల్లుతోపాటు మిగిలిన గ్రామాలకూ 16 శాతం హెచ్‌ఆర్ఎ వర్తింపజేయాలి.

సమస్యల పరిష్కారమే మా ఎజెండా

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి

ఎంతోమంది త్యాగాల ఫలితంగా యుటిఎఫ్ ఏర్పడింది. వారి ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడంలో యుటిఎఫ్ ముందుంటుంది, ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే యుటిఎఫ్ ఎజెండా. హెచ్‌ఆర్ఎ వర్తింపు విషయంలో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించడం వల్లే ప్రస్తుతం న్యాయం జరిగింది. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయి అనే విషయం అంతా గమనించాలి.

పోరాట ఫలితమే

కెసిహెచ్.సాయిరాం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి

16 శాతం హెచ్‌ఆర్ఎ వర్తింపు విషయంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ కృషి ఎనలేనిది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవిశ్రాంతంగా జిల్లా కమిటీ శ్రమించింది. ప్రభుత్వం నుంచి గెజిట్ వచ్చే వరకు జిల్లా కమిటీ నేతలు అలుపెరగని కృషి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏ సమస్య ఏర్పడినా యుటిఎఫ్ జిల్లా కమిటీ ముందుండి ప్రభుత్వంతో పని చేయించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

రైతుల అభ్యున్నతికి కృషి

ఎఒ జ్యోషిల

చిట్‌చాట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందేందుకు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నదే తన ధ్యేయమని మండల వ్యవసాయాధికారి ఆడబాల జ్యోషిల అన్నారు. ఆమె చదువుకునే రోజుల్లో డాక్టర్ అవుదామనుకున్నారు. కాని మంచి వ్యవసాయ అధికారిగా రైతుల మన్ననలు పొందే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెతో ప్రజాశక్తి చిట్‌చాట్..

ప్రశ్న : స్వగ్రామం ఏది? ఎక్కడ చదువుకున్నారు?

స్వగ్రామం మొగల్తూరు సీతారాంపురం. నాన్న త్రిమూర్తులు, అమ్మ వరలక్ష్మి. విజయనగరంలో చదువుకున్నాను.

ప్రశ్న : ఇప్పటివరకు ఎక్కడెక్కడే పనిచేశారు?

విజయనగరంలో హైస్కూల్ చదువు పూర్తి చేసుకుని 1997 కరీంనగర్ జిగిర్యాల ఆర్ఎఆర్ఎస్‌లో, రాజమండ్రిలో ఎజి బిఎస్‌సి చేశారు. 2009 నుంచి పోడూరు మండలం ఎంఇఒగా, 2004 నుంచి ఎన్ఆర్ఇజిస్‌లో చేశాను. 2014 నుంచి 2021 వరకు మొగల్తూరులో, 2024 వరకు నరసాపురంలో ఎఇఒగా చేశాను. ప్రమోషన్ నిమిత్తం పెనుమంట్ర ఎఒగా బాధ్యతలు స్వీకరించాను.

ప్రశ్న : కుటుంబ సభ్యుల నేపథ్యం ఏంటి? ఈ స్థాయికి రావడానికి కారణం ఎవరు?

చిన్నప్పటి నుంచి నాన్న త్రిమూర్తులు చాలా గారాబంగా పెంచారు. ఈ స్థాయికి రావడానికి ప్రధాన కారణం నాన్న. తర్వాత భర్త కత్తుల శ్రీనివాస్. ఇద్దరు కూడా నన్ను ప్రోత్సహించారు.

ప్రశ్న : రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏంటి?

రైతులు పంట పండించే కొన్ని సందర్భాల్లో అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలి. అప్పుడే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించడం సాధ్యమవుతుంది.

ఎస్ఎఫ్ఐ పూర్వ కార్యకర్తలు

ఉత్సాహంగా ఎస్ఎఫ్ఐ పూర్వ కార్యకర్తల సమ్మేళనం

ప్రజాశక్తి - యలమంచిలి

వారంతా గతంలో విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం ఎవరికి వారు తమ తమ వృత్తులు, రాజకీయ జీవితంలో బిజీగా ఉన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ కార్యకర్తలంతా కలిసి ఆదివారం మండలంలోని చించినాడ గ్రామంలోని స్థానిక కొబ్బరితోటలో ఎస్ఎఫ్ఐ ఎక్సలెంట్ టీం పేరుతో సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ ఈ సందర్భంగా గతంలో తాము విద్యార్థుల సమస్యలపై చేసిన పోరాటాలను, విజయాలను, అదే క్రమంలో ఎస్ఎఫ్ఐ నుంచి నేర్చుకున్న క్రమశిక్షణను నెమరు వేసుకుని ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆట పాటలతో, అభ్యుదయ గీతాలు ఆలపిస్తూ సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు దొండపాటి అజయ్ అధ్యక్షత వహించగా తొట్టెంపూడి కోటేశ్వరరావు, అరటి కట్ల రవి, పూరిళ్ల శ్రీనివాస్‌లు మాట్లాడారు. తాము 1985 నుంచి 2000 సంవత్సరం వరకు ఎస్ఎఫ్ఐ ఆశయం కోసం అందరికీ విద్య, ఉపాధి సాధించడమే లక్ష్యంగా పోరాడమన్నారు. ఇప్పటికీ అవే సమస్యలు ఉత్పన్నం కావడం దురదృష్టకరమన్నారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని గుర్తించాలన్నారు. ప్రస్తుతం తమ సభ్యులంతా వివిధ వృత్తుల్లో కొనసాగుతున్నప్పటికీ ఎల్లవేళలా ఎస్ఎఫ్ఐ, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు బిఇ తిరుమలరాజు, జోగి శ్రీను, కేతవాసు టివి.అప్పారావు, తెన్నేటి వెంకటేశ్వరరావు, శీలం గంగాధరరావు పాల్గొన్నారు.

సత్తెమ్మకు మందులు, నిత్యావసర వస్తువులు అందిస్తున్న సుధాకర్

అనారోగ్య బాధితునికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

నిస్సహాయులకు ప్రభుత్వంతో పాటు సమాజం కూడా చేయూతనివ్వాలని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. పెనుగొండ బస్టాండ్ దగ్గరలో నివాసం ఉంటున్న కండెల్లి సత్తెమ్మ సోదరుడు అనారోగ్యంతో మంచం పట్టాడు. ఆమె కుమార్తెలు శస్త్రచికిత్స చేయించుకున్నారు. భర్తలేని తన కుటుంబ జీవనం కష్టంగా ఉందని, మందులతో పాటు నిత్యావసర వస్తువులను అందించి ఆదుకోవాలని సత్తెమ్మ కోరింది. దీంతో స్పందించిన సుధాకర్ పాలకొల్లు డీలక్స్ రోడ్డులో ప్రియాంక టవర్స్ వద్ద ఆమెకు రూ.ఏడు వేల విలువైన నిత్యావసర వస్తువులు, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, డైరెక్టర్ జవ్వాజి కల్యాణ్ పాల్గొన్నారు.

ఎంపిటిసి సభ్యులను సత్కరిస్తున్న ప్రజలు

మార్టేరులో సీసీ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సామాజిక మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ధ్యేయమని మార్టేరు ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. మార్టేరు ఎంపిటిసి నిధులతో శివరావుపేటలోని చర్చి వద్ద నిర్మించిన సీసీ రోడ్డును వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధులు అందించిన ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణ్‌రెడ్డిలను ఆ ప్రాంత ప్రజలు, వైసిపి సమన్వయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సత్తివెంకట్‌రెడ్డి, వైసిపి మాజీ గ్రామ అధ్యక్షులు వెలగల నారాయణరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు కొవ్వూరి బ్రహ్మేశ్వర్‌రెడ్డి, జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ తమనంపూడి ఈశ్వరరెడ్డి, బిసి సెల్ జిల్లా సెక్రటరీ గుత్తుల బోసు, శివాలయ కమిటీ ఛైర్మన్ వెలగల శత్రుఘ్నరెడ్డి, వేణుగోపాల స్వామి ఆలయ ఛైర్మన్ సత్తి చంద్రారెడ్డి, మండల మాజీ అధ్యక్షులు సత్యవిష్ణుకుమార్‌రెడ్డి, మార్టేరు శివాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సత్తి సనత్‌కుమార్‌రెడ్డి, మేడపాటి సూర్యనారాయణరెడ్డి, వైసిపి మార్టేరు గ్రామ కన్వీనర్ చిర్ల సత్యనారాయణరెడ్డి, బైరెడ్డి సత్తిబాబు, కర్రి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రైల్వే లైన్ డబ్లింగ్‌తో సమస్యలు

ప్రయాణికులు, వాహనదారుల అవస్థలు
అండర్ టన్నెల్ నిర్మించాలని వేడుకోలు

పట్టణంలోని సిద్దాపురం రోడ్డులో రైల్వే గేటు వద్ద వాహనాల రాకపోకలు

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రమైన ఆకివీడు పట్టణంలో సిద్దాపురం రోడ్డులో రైల్వే గేట్ వద్ద అండర్ టన్నెల్ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే డబ్లింగ్ లైన్ విద్యుదీకరణ పనులు పూర్తవ్వడంతో మొదట్లో ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఆనందపడ్డారు. రైళ్ల సంఖ్య పెరుగుతుందని ఆశించారు. మెయిన్ లైన్‌లో ఉన్న రైళ్లు కొన్నయినా ఇటు మళ్లిస్తారని మొదట్లో భావించారు. వారి ఆశ నిరాశగానే మిగిలింది. రైళ్ల సంఖ్య పెరిగింది. కాని ప్రయాణికుల రైలు కాకుండా గూడ్స్ రైళ్ల సంఖ్య పెరిగింది. ఒకటి రెండు కాదు మెయిన్ రూట్‌లో ప్రయాణించే గూడ్స్‌లో సగం పైగానే ఇటు మళ్లించారు. రోజుకు 30 గూడ్స్‌ల పైన ఇటుగా తిప్పారు. అయితే ప్రయాణికుల రైలు మాత్రం ఒక్కటి కూడా పెరగలేదు సరి కదా తగ్గాయి. కాగా గతం నుంచి ఉన్న ప్రయాణికుల రైళ్లు రాను, పోను 20 పైగానే ఉన్నాయి. మొత్తంమీద రోజుకు 50కి పైగా రైళ్లు తిరుగుతున్నాయి. అసలు సమస్య ఇక్కడే వచ్చి పడింది. మండల కేంద్రం ఆకివీడు నుంచి సిద్దాపురం, కొల్లేరు తీర గ్రామాలకు వెళ్లే రోడ్డు మధ్యలో ఒక గేటు ఉంది. మరో గేటు దుంపగడపకు వెళ్లే మార్గంలో ఉంది. గేట్లకు దక్షిణం వైపున ఆకివీడు పట్టణం ఉన్నప్పటికీ, గేటు దాటి అవతలకు అంటే ఉత్తరం వైపుగా సుమారు నాలుగో వంతు పట్టణం ఉంది. గ్రామం మధ్యగా రైలు పట్టాలు వెళ్లడంతో రెండు గేట్లు ఏర్పడ్డాయి. ఇక్కడ వరకు బాగానే ఉంది. అయితే గూడ్సుల సంఖ్య పెరగడంతో ఈ గేట్లు తరచుగా పడుతూ ఉండడంతో ప్రజల సమస్య మొదలైంది. రోజు మొత్తం మీద పగటి వేళల్లో సగటున 20 నుంచి 30 నిమిషాలకు ఒకసారి గేటు పడుతుండటంతో ప్రజలు విసిగిపోతున్నారు. దుంపగడపలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆ రోడ్డులో ఉన్న గేటు గుండా ప్రతిరోజు వందల సంఖ్యలో విద్యార్థులు కళాశాలలకు వెళ్తూ ఉంటారు. దుంపగడప గ్రామస్తులకు వేలాది మందికి, ఆకివీడు ప్రజానీకానికి ఆ రోడ్డు ఒక మార్గం. ఇక రెండో గేటు సిద్దాపురం రోడ్డులో ఉన్న గేటు. సుమారు ఏడు గ్రామాల ప్రజలు, వేలాది మంది రైతులు, కొల్లేటిదిగో ప్రాంత గ్రామస్తులు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ఇక మండల కేంద్రానికి, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు రకరకాల పనులపై వచ్చే వారందరూ ఆ రోడ్డు గుండానే రావాలి. అయితే ఆ మార్గంలో తరచూ గేటు పడటం సమస్యగా మారింది. గేటు వేసి కనీసం 20 నిమిషాల వరకు తీయడం లేదు. మళ్లీ మరో ఐదు నుంచి పది నిమిషాల్లో గేటు పడిపోతుంది. దీంతో ప్రజానీకం విసిగిపోతున్నారు. ప్రత్యామ్నాయం కోసం రకరకాల ప్రయత్నాలు ఆలోచించినా ఒక్క అండర్ టన్నెల్ తప్ప వేరే మార్గం కనిపించడం లేదు. వెంటనే సిద్దాపురం రోడ్డులో అండర్ టన్నెల్ నిర్మించాలని స్థానికులు ప్రభుత్వానికి తరచూ విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. మున్సిపాలిటీ సైతం ప్రభుత్వానికి పంపింది అధికారపార్టీ నాయకులకు సైతం విజ్ఞప్తి చేశారు. అయినా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మరోపక్క గేటు ప్రభావంతో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయింది. సిద్దాపురం రోడ్డులో గేటు దాటి గేటుకు ఉత్తర దిక్కున ఉన్న స్థలాలు ఇళ్ల స్థలాల రేట్లు భారీగా పడిపోయాయి. దీంతో ఇంచుమించు క్రయవిక్రయాలు ఆగిపోయాయి. ఈ మార్గంలో రైతులు, పలు గ్రామాల ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులకు అనుకూలంగా ఉండే విధంగా వెంటనే రైల్వే అండర్‌టన్నెల్ నిర్మించాలని కోరుతున్నారు.

ద్విచక్రవాహనదారుడు లోపల ఉండగా వేసిన గేటు

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పికె.రావు

ప్రజాశక్తి -భీమవరం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పికె.రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, శ్రీ వేద విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు డివి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. బ్రాహ్మణ శక్తిపీఠం రాష్ట్ర కార్యవర్గం తరపున సిఎంకు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాల తరబడి సామాజిక సేవా కార్యక్రమాల్లో పికె.రావు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించినట్లు తాము భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది బ్రాహ్మణ ప్రముఖులతో పాటు కులాలకు, మతాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల్లో పికె.రావుకు పేరుందని, బ్రాహ్మణ సామాజిక వర్గంతో పాటు, ఇతర కులాల్లోని పేద వర్గాలకు ఆయన అండగా ఉంటారని చెప్పారు. ప్రస్తుతం బ్రాహ్మణ శక్తి పీఠం, రాష్ట్ర కార్యవర్గ గౌరవ అధ్యక్షులుగా ఉన్న పికె.రావు నియామకం తమ సంస్థకు హర్షదాయకమని తెలిపారు. పికె.రావు ఆధ్వర్యంలో త్వరలో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని డివి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

అవార్డు అందుకుంటున్న నాగేంద్రవర్మ

నాగేంద్రవర్మకు అవార్డు
పలువురి అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

న్యాయవిద్యలో దేశంలోనే చాలా ప్రాముఖ్యత కలిగిన అవార్డుకు చెన్నైలోని హిందూస్థాన్ స్కూల్ ఆఫ్ లా ఎంపికైంది. దానికి డీన్‌గా వ్యవహరిస్తున్న భీమవరం పట్టణానికి చెందిన ప్రొఫెసర్ పివి.నాగేంద్రశర్మ అవార్డు అందుకున్నారు. ఏలూరు సిఆర్ రెడ్డి లా కళాశాల, కురుక్షేత్ర యూనివర్సిటీల్లో విద్య అభ్యసించిన ఆయన గత మూడు దశాబ్దాలుగా న్యాయ విద్య అధ్యాపకుడిగాను, వివిధ హోదాల్లోనూ పనిచేశారు. తాజాగా అసోసియేటెడ్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచమ్) చెన్నైలోని హిందూస్థాన్ స్కాల్ ఆఫ్ లాను బెస్ట్ అప్కమింగ్‌లా కాలేజీగా గుర్తించారు. దీనికి నాగేంద్రశర్మ డీన్ హోదాలో కొనసాగుతున్నారు. ఈ నెల 20న ఢిల్లీలో జరిగిన భారత్ లీగల్ కాన్క్లేవ్-2023లో భీమవరం పట్టణానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పమ్మి వెంకట నాగేంద్రశర్మ కేంద్ర న్యాయ శాఖామంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. అసోచమ్ ఏటా వివిధ రంగాల్లోని వ్యక్తులకు, సంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ సారి న్యాయవిభాగానికి సంబంధించి ఉత్తమ న్యాయ కళాశాలకు కూడా అవార్డు ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఈ అవార్డులను ఎంపిక చేయగా తొలి అవార్డును నాగేంద్రశర్మ పర్యవేక్షణలోని కళాశాల ఎంపికవ్వడం విశేషం. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రమాణాలతో కూడిన న్యాయవాద విద్య అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా నాగేంద్రశర్మ తెలిపారు. నాగేంద్రశర్మ కేంద్రమంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం పట్ల భీమవరం పట్టణానికి చెందిన విద్యావేత్తలు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వరి, చేపల సాగుకు నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 1.87 లక్షల ఎకరాల్లో వరి సాగు, 1.05 లక్షల ఎకరాల్లో చేపల సాగు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సాగునీటిపై చర్చించినట్లు చెప్పారు. సమావేశం దృష్టికి వచ్చిన సాగునీటి అంశంపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 20 మండలాల్లోని 290 గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు రెవెన్యూ, వ్యవసాయం, మత్స్య, ఇరిగేషన్, ఎంపిడిఒలతో టీంను ఏర్పాటు చేసి పరిశీలించినట్లు పేర్కొన్నారు. వారు అందించిన నివేదిక ప్రకారం 262 గ్రామాల్లో సాగునీటి కొరత లేదని, ఆకివీడు, పాలకోడేరు, వీరవాసరం, కాళ్ల, అత్తిలి, పాలకొల్లు, ఆచంట, మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి, పెనుమంట్ర మండలాల్లోని 24 గ్రామాల్లో సాగునీటి లోటుగా ఉందని, పాలకోడేరు, పోడూరు మండలాల్లోని రెండేసి గ్రామాల చొప్పున మొత్తం నాలుగు గ్రామాల్లో నీటి కొరత ఉన్నట్లు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సాగునీటి సరఫరా ఇబ్బందులను తొలగించడానికి కర్ర నాచు, గుర్రపుడెక్క తొలగింపు, కొన్ని గ్రామాల్లో నీటి విడుదల పెంపుదల చేపట్టాలని ఆయా మండలాల్లో సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టేందుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. సాగునీటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు యుద్ధ ప్రాతిపదికను తీసుకున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

రచ్చబండ తీర్పులకు చట్టబద్ధత కల్పించుకోవాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రచ్చబండ తీర్పులకు చట్టబద్ధత కల్పించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయవాది కామన మునిస్వామి అన్నారు. తణుకులో శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో ప్రజలకు ఆదివారం ఉచిత న్యాయ సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లా డుతూ గ్రామాల్లో రచ్చబండల వద్ద జరిగిన రాజీలన్నిటికీ లోక్ అదాలత్ ద్వారా చట్టబద్ధత కల్పించుకోవాలన్నారు. స్థిరాస్తి కలిగి ఉన్న వ్యక్తి ప్రాణభయం ఉంటే వెంటనే పోలీసులకు ఇవ్వాలన్నారు. ఎవరైతే భయపెడుతున్నారో ఆ వ్యక్తులను పోలీసు అధికారులు పిలిపించి విచారణ జరిపి ఎటువంటి ప్రాణహాని ఉండకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించుకుంటే భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు చట్టపరంగా ఉండవని తెలిపారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

న్యాయ సలహాలు ఇస్తున్న మునిస్వామి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు : సిఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోలీసులకు ఎవరిపైనా కక్ష ఉండదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితుల్లో కొంచెం కఠినంగా వ్యవహరిస్తారని భీమవరం వన్‌టౌన్ సిఐ ఆడబాల శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించారు. సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉంటారన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ట్రాఫిక్ సిఐ దాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణంలో పోలీసు అధికారుల ఆదేశాల ప్రకారం ర్యాలీ, విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నామని, ముగింపు రోజున బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ ఎ.వీరయ్య, పి.అమూల్యారావు, జిల్లా టైలర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్.కోటేశ్వరరావు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు యింటి సత్యనారాయణ, పంపన గోపీ, చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షులు కడలి హరిబాబు, సాయి పాల్గొన్నారు.

సుందర పార్కుగా డంపింగ్ యార్డు

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న గుడాల గోపీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు యడ్ల బజార్ సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డు త్వరలో సుందరపార్కుగా మారనున్నట్లు వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చెప్పారు. డంపింగ్ యార్డులో జరుగుతున్న పనులను డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఉన్న సమస్యకు సిఎం జగన్ కృషితో పరిష్కారం లభించిందన్నారు. రోజు 25 టన్నుల చెత్త గుంటూరుకు చెందిన ఏజెన్సీ ఎరువు, మట్టిగా మారుస్తుందని చెప్పారు. ఇలా మొత్తం 25,180 టన్నుల చెత్త తొలిగిస్తామని చెప్పారు. ఖాళీ అయిన డంపింగ్ యార్డును సుందర పార్క్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇప్పటికి సంబంధించిన మెటీరియల్‌ను ఆయన పరిశీలించారు. వారం రోజుల్లో పనులు మొదలవుతాయని చెప్పారు. వారితో పాటు వైసిపి నేతలు కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, ఉనికిల శ్రీనివాస్, జోగి వడ్డికాసులు, పాలపర్తి కృపానంద్, కృష్ణాజీ, చెన్ను విజయ్, రేలంగి శ్రీను పాల్గొన్నారు.

'టిడిపిని అధికారంలోకి తీసుకురావాలి'

ప్రజాశక్తి - కాళ్ల

తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. చంద్రబాబు అరెస్టుపై సుభాష్ చంద్రబోస్ మాజీ సైనిక్ కాలనీ గ్రామంలో ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆదివారం ఇంటింటికి తెలుగుదేశం, మన రాంబాబు, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలతో పాటు బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందన్నారు. జలజీవన్ మిషన్ నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, బోస్ కాలనీ, కలవపూడి గ్రామ సర్పంచులు మంతెన శ్రీనివాసరాజు, గేదెల జాన్, పుప్పాల బుజ్జి, తోట ఫణిబాబు, బండారు వేణు, లంకపల్లి జ్ఞానరాజు, మద్దిరాల దానియేలు, పత్తి సత్యనారాయణ, లంకపల్లి యెహొషావ, మేడిద రాజు, వెలగాడ వెంకట్రావు, వాడాడ కుర్మయ్య పాల్గొన్నారు.

ఆచంట :చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 40వ రోజు ఆదివారం కొనసాగాయి. ఈ దీక్షా కార్యక్రమానికి మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు సంఘీభావం తెలిపారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తుందన్నారు. చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. ప్రజల్లో టిడిపికి వస్తున్న ఆదరణ చూసి జగన్‌కు భయం పట్టుకుందని, ఈ నేపథ్యంలో ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం కక్ష పూరిత సాధింపుతోనే కుట్ర చేసి చంద్రబాబును జైలుకు పంపారన్నారు. ఈ కార్యక్రమంలో పితాని వెంకట్, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు గొడవర్తి శ్రీరాములు, బలుసు శ్రీరామ్మూర్తి, నెక్కంటి ప్రభాకర్, కొండేటి వీరస్వామి, మానేపల్లి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, అరుణ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుపై నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారంతో 40వ రోజుకు చేరాయి. దీక్షల్లో శ్రీక్షీరారామ మోటార్‌సైకిల్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. వీరిని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి అభినందించారు.

రక్తదానం చేసిన ప్రభాస్ అభిమానులు

ప్రభాస్ అభిమానుల రక్తదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ముద్దుబిడ్డ యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పలువురు అభిమానులు రక్తదానం చేశారు.

నేడు మోగల్లులో గ్రామసభ

ప్రజాశక్తి - పాలకోడేరు

మోగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రీ సర్వే నిమిత్తం సోమవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు విఆర్ఒ గుత్తుల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులందరూ గ్రామ సభకు హాజరు కావాలని తెలిపారు. గ్రామసభలో రైతుల పొలాలకు చెందిన వివరాలు చదివి వినిపించనున్నట్లు తెలిపారు. రైతులందరు భూములు హెచ్చు తగ్గులు ఉంటే సరి చేసుకోవాలని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వేడంగిపాలెం, అప్పన్నచెరువు గ్రామాల్లో టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలతో సమావేశం నిర్వహించి వారికి చేకూరే లబ్ధిని వివరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కుక్కల మునింద్ర, ఎంపిటిసి సభ్యులు విప్పర్తి శారద, పాల నాగలక్ష్మి పాల్గొన్నారు.

టిడ్కో గృహాలివ్వాలని ఎంఎల్ఎ నిమ్మల నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

నిర్మాణ పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇవ్వాలని కోరుతూ ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఆదివారంపై సైకిల్‌పై తిరుగుతూ పేపర్ వేసి నిరసన తెలిపారు. లబ్ధిదారులకు ఇల్లు అందక బ్యాంక్ రుణాలు, ఇంటి అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెదగరువులో టిడిపి హయాంలో ప్రారంభించిన గృహాల నిర్మాణ పనులు తిరిగి మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వరప్రసాద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, జనసేన పార్టీ నాయకులు, ఎంఎస్ఎంఇ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ధనపు పురుషోత్తమవరప్రసాద్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాయపేటలోని వరప్రసాద్ అతిథి గృహంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుక సభలో ప్రసాద్ క్షేమాన్ని కాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, నాయకులు బొమ్మిడి రవి శ్రీనివాస్, నూలి శ్రీనివాస్, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, గునిశెట్టి శ్రీనివాస్, రౌతుల శ్రీను పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ రఘురామకృష్ణంరాజు, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌లు ఫోన్‌లో ప్రసాద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో జనసేన నాయకుడు వర్ధనపు వరప్రసాద్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసైనికులు ఏర్పాటు చేసిన కేకును వరప్రసాద్ కోసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద్‌కు జనసైనికులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కు గిరి, కాకర విజయ ప్రసాద్, నల్లి రాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.